

గోడ కూలి.. ఇద్దరు కూలీల దుర్మరణం

- బ్రాహ్మణపల్లిలో పనులు చేస్తుండగా ప్రమాదం..
- కోటపల్లిలో విషాదం

6

యువత సన్మార్గంలో నడవాలి

జన్నారం, జూలై18 (ఆంధ్రజ్యోతి): యువత సన్మార్గంలో నడవాలని లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి అన్నారు. శుక్రవారం మండలం లోని బంగారు తండ, హాస్టల్‌తండావిలేజ్ విజిటింగ్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు, గంజాయి, మద్యపానం వంటివి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అదేవిధంగా ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసుల దృష్టికి తీసుకరావాలని చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ముందుంటామన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని యువత సన్మార్గంలో నడిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆయన వెంట ఎస్ఐ అనూషతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లంచం ఇస్తేనే.. బీమా సొమ్ము..

- ఏసీబీకి పట్టుబడ్డ కార్మిక శాఖ అధికారులు
- మంచిర్యాలలో ఒకరు.. బెల్లంపల్లిలో మరొకరు
- బాధితుల నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

6



అమ్మవారికి వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

అమ్మవారి ఆశీస్సులు ఉండాలి

మందమర్రిటౌన్, జూలై18 (ఆంధ్రజ్యోతి): మైసమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి జి. వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జియాగూడ దర్బార్‌మైసమ్మ ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు అమ్మ వారికి వస్త్రాలు సమర్పించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యుల పేరిట అర్చనలు చేయించారు. తొలిసారి వచ్చిన మంత్రిని ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు.

మళ్లీ రోడ్డెక్కిన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

- హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని నినాదాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏటీడీవో పురుషోత్తం

కోటపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కోటపల్లిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు శుక్రవారం మళ్లీ రోడ్డెక్కారు. పాఠశాలకు వెళ్లే దారిలో బైఠాయించి ధర్నా చేపట్టారు. తమతో అసభ్యంగా ప్రవర్తించిన హెచ్‌ఎం అశోక్‌ను బదిలీ చేయడం కాదని, ఆయనను సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. దీంతో అప్పటికే ఏటీడీవో పురుషోత్తం, తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎస్ఐ రాజేందర్‌లు సంఘటన స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. రోడ్డుపై బైఠాయించడం తగదని, పాఠశాలకు వెళ్లాలని కోరారు. అయినా ససేమిరా అంటూ విద్యార్థినులు రోడ్డుపైనే కూర్చున్నారు. పది రోజుల్లో హెచ్‌ఎంపై చర్యలు తీసుకుంటారని విచారణ అధికారులను కలెక్టర్ నియమించారని, విచారణ అనంతరం చర్య ఉంటుందని చెప్పడంతో విద్యార్థినులు పాఠశాలలోకి వెళ్లిపోయారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు

కోటపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : చట్టాన్ని అతిక్రమించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని చెన్నూరురూరల్ సీఐ బన్సీలాల్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కోటపల్లి, నీల్వాయి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ ఇసుక, పీడీఎస్ బియ్యం, గుడుంబా రవాణా చేసినా, గంజాయి అమ్మడం, సేవించి వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకో వడంతో పాటు పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. ప్రతీ ఒక్కరు చట్టానికి లోబడి ఉంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కోటపల్లి, నీల్వాయి ఎస్ఐలు రాజేందర్, శ్యామ్ పటేల్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాల మార్క్సిభవన్‌లో నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా విద్యారంగ సమస్యలను పరిష్కరించడం, పెండింగ్ బకాయిలను చెల్లించడం లేదన్నారు. విద్యారంగంలోని పోస్టులను భర్తీచేయాలని, సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన బంద్‌లో విద్యార్థులు, యాజమాన్యాలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీకాంత్, సన్నిగౌడ్, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, సికిందర్, నిఖిల్, సుమంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

మండల స్థాయి అవగాహన సమావేశం



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

చెన్నూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై మండల స్థాయి అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ప్రత్యేకాధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతిపై ఉన్న ప్రశ్నావళిని వివిధ శాఖల వారీ సహకారంతో పంచాయతీ కార్యదర్శులు రెండురోజుల్లో సేకరించి సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలియజేశారు. గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా అంటు వ్యాధులు సోకకుండా పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా అంగన్‌వాడీ సిబ్బంది వారానికి రెండుసార్లు ప్రత్యేకడ్రైవ్ నిర్వహించాలన్నారు.

రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారిని నియమించండి

శ్రీరాంపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ ఏరియాలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారిని నియమించాలని హెచ్ఎంఎస్ కేంద్ర నాయకుడు తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు వి. అనిల్ రెడ్డి, ఎస్‌టీపీపీ నాయకులు సాయికృష్ణారెడ్డి, సంపత్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో పీఐఓగా పనిచేసిన డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు చనిపోగా, డీజీఎం(పర్సనల్) బదిలీపై రామగుండం ఏరియాకు వెళ్లారన్నారు. అప్పటి నుంచి పీఐఓగా ఎవరూ లేరన్నారు. దీనివల్ల సమాచారం ఎవరిని అడగాలో తెలియడం లేదన్నారు. స.హ. చట్టం కార్యకర్తలు, ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారిని నియమించాలని వారు యాజమాన్యాన్ని కోరారు.

మత్స్యకారుల ధర్నాను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 25న కలెక్టరేట్ వద్ద చేపట్టే మత్స్యకారుల ధర్నాను విజయవంతం చేయాలని మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి బోడెంకి చందు పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాలలోని చార్వాక ట్రస్టు హాలులో ధర్నా కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. స్వాతంత్ర్యంవచ్చి 78 సంవత్సరాలు అవుతున్నా ఇంకా మత్స్యకారులు వెనకడి ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లోపెట్టే నిధులు మత్స్యకారులకు అందడం లేదన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు అందించిమ మత్స్యకారుల పొట్ట కొడుతున్నారన్నారు.

జిల్లాలోని చెరువుల, కుంటలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో 20 కోట్లతో అధునాతమైన సౌకర్యాంతో హోల్ సేల్ చేపల మార్కెట్ నిర్మించాలని తదితర డిమాండ్లతో చేపట్టే ధర్నాను మత్స్యకారులు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణ, రాజేందర్, మహేష్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పదవుల కోసం నిరీక్షణ..



- నామినేటెడ్, డీసీసీ పదవుల కోసం కాంగ్రెస్ కసరత్తు
- జిల్లా స్థాయిలోనూ పదవుల భర్తీకి సన్నాహాలు
- రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్లకూ అవకాశం
- ఎమ్మెల్యేల చేతుల్లోనే డీసీసీ పదవి
- కీలక పదవుల్లో నియామకాలపై టీపీపీసీ దృష్టి

మంచిర్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్‌తో పాటు డీసీసీ పదవుల భర్తీపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది. ఈ మేరకు పార్టీ భారీ కసరత్తు చేస్తోంది. పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్రంలో పదవుల నియామకం చేపట్టనుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహన్ని నింపుతోంది. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల సమయంలో పదవులు ఆశించి భంగపడ్డ నేతలు, జిల్లా స్థాయిలో పార్టీ కోసం ఏళ్లతరబడి కష్టపడ్డ కార్యకర్తలకు పార్టీ పదవుల్లో పెద్దపీట వేస్తామని, త్వరలో నామినేటెడ్‌తో పాటు పార్టీ పదవుల కేటాయింపు ఉంటుందని అధిష్ఠానం ప్రకటించింది. దీంతో ఆ పార్టీ క్యాడర్‌లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. దీంతో పదవులు ఆశిస్తున్న నాయకులు ఎమ్మెల్యేల ద్వారా పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తులు చేస్తున్నారు. ఇదిలా ఉండగా డీసీసీ పదవిని జిల్లాలోని శాసనసభ్యులకే ఇవ్వాలని పార్టీ సూత్రప్రాయంగా నిర్ణయించగా, ఇతర సీనియర్ నేతలకూ లభించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డీసీసీ పదవుల అంశం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. త్వరలో పదవులు భర్తీ చేసేందుకు అధిష్ఠానం ప్రయత్నిస్తుండగా ఎవరె వరికి ఏయే పదవులు లభిస్తాయన్నది ఉత్కంఠగా మారింది.

డీసీసీ పదవి వరించేదెవరినో...?

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవిని ఎమ్మెల్యేలకి ఇవ్వాలని అధిష్ఠానం సూత్రపాయంగా నిర్ణయించినట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే డీసీసీ పదవిని చేపట్టేందుకు ఎమ్మెల్యేలు ఆసక్తిగా లేరని తెలుస్తోంది. ఒకవేళ ఎమ్మెల్యేలు ఆసక్తి చూపని పక్షంలో సీనియర్ నేతలు, క్రియాశీలకంగా ఉన్న నేతల పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తుందనే ప్రచారం జరుగుతోంది. దీంతో జిల్లా అధ్యక్ష పదవి హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సతీమణి కొక్కిరాల సురేఖ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెండు పర్యాయాలుగా ఆమె పదవిలో ఉండగా, జిల్లా క్యాడర్‌ను ఏకతాటిపై ఉంచా రన్న పేరు సురేఖకు ఉంది. పార్టీ క్యాడర్‌కు నిత్యం అందుబాటులో ఉంటారనే పేరు సైతం సురేఖకు ఉంది. అయితే ప్రభుత్వ నిర్ణయం మేరకు మార్పులు జరిగే అవకాశాలు ఉంటాయన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఒకవేళ డీసీసీ అధ్యక్షులుగా కొత్తవారిని నియమిస్తే ఎవరికి ఆ పదవి వరిస్తుందోనన్న చర్చ జోరుగా సాగుతోంది. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో సీనియర్ నాయకులు ఉండగా, వారంతా ప్రస్తుతం ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేల కనుసన్నల్లో పయనిస్తున్నారు. దీంతో డీసీసీ పదవిని అలంకరించే స్థాయి గల వ్యక్తుల వివరాలను అధిష్ఠానం తెప్పించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం పదవిని అలంకరిస్తున్న కొక్కిరాల సురేఖనే మరోమారు కొనసాగించవచ్చుననే ప్రచారం కూడా జరుగుతోంది. మరోవైపు డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారిలో చెన్నూరు నియోజక వర్గానికి చెందిన సీనియర్ నేత పురాణం సతీష్‌కుమార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన బీఆర్ఎస్ పార్టీలో ఉండగా 12 ఏళ్ల (తరువాయి 7లో)

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

మంచిర్యాలకలెక్టరేట్, జూలై18 (ఆంధ్ర జ్యోతి) : ఎస్సీ మోస్టు మెట్రిక్ హాస్టల్ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్ర వారం హైదరాబాద్‌లోని తెలంగాణ షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ కమీషనర్‌కు వినతి పత్రం అందించారు.

ఈ సందర్భంగా సీఐటీ యూ రాష్ట్ర కార్యదర్శి మధు, జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్‌ల మాట్లాడుతూ హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, కామాటాలను క్యాటరింగ్ విధానం ద్వారా విద్యార్థుల సంఖ్యను బట్టి వర్కర్లకు డబ్బులు చెల్లిస్తున్నారన్నారు. వాచ్ మెన్, స్వీపర్లకు కూడా అతితక్కువ వేత నాలు వస్తున్నాయన్నారు. పెరిగిన ధరలకు ఈ వేతనాలు సరిపోవడం లేదన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని, వేతనాలను పెంచాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, స్వాతి, స్వరూప పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని వెనకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగ యువతకు వెనకబడిన తరగతుల స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్ 1, 2, 3, 5, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సుల్లో ఉచితశిక్షణ అందించేందుకు అర్హత గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, బీసీ స్టడీ సర్కిల్ ఆదిలాబాద్ సంచాలకులు ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ ధృవపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆగస్టు 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 08732-221280లో సంప్రదించాలన్నారు.



తిరుపతికి ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేంసాగర్‌రావు

ఎల్‌వోసీ అందజేత

దండేపల్లి జూలై 18 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామానికి చెందిన లశెట్టి సుజాత వైద్య ఖర్చుల కోసం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అండగా నిలిచారు. ఇటీవల సుజాత అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. ఆమె వైద్య ఖర్చుల కోసం స్థానిక కాంగ్రెస్ నాయకుడు చుంచు నగేష్, దుమ్మని సందీప్, సతీష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. శుక్రవారం హైదరాబాద్ ఎమ్మెల్యే నివాస గృహంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ చేతుల మీదుగా వైద్య ఖర్చుల కోసం రూ. 2 లక్షల 50 వేల ఎల్‌వోసి పత్రాన్ని లశెట్టి తిరుపతికి అందజేశారు.

పోలీసుల కార్డన్ సెర్చ్

చెన్నూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొక్కూరు గ్రామంలో చెన్నూరు పట్టణ సీఐ దేవేందర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం కార్డన్‌సర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలులేని 50 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేశారు. అలాగే నాటుసారా స్థావరాలను గుర్తించి వెయ్యిలీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 20లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్‌సర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఎవరు నాటుసారా, గుడుంబా తయారు చేయవద్దని, గంజాయి సేవించవద్దన్నారు. ప్రతి వాహనదారుడు వాహన ధృవీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుకున్న నాటుసారా, బైక్‌లతో పోలీసులు

పాఠశాలను పరిశీలించి..పాఠాలు బోధించి

- కస్తూర్బాను సందర్శించిన కలెక్టర్



విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, జూలై18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బాగాంధీ బా లికల పాఠశాల, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠా లను బోధించారు. అనంతరం కస్తూర్బా కళాశాల భవనాన్ని పరిశీలించారు. పనులు ఎందుకు ఆలస్యంగా చేస్తున్నారని సంబంధిత కాంట్రాక్టర్‌పై ఆగ్ర హం వ్యక్తం చేశారు. మరో రెండు నెలల్లో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ సమాధానం ఇవ్వడంతో కళాశాల బిల్డింగ్ పనులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని రెండు నెలల్లో ఏ విధంగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. త్వరితగతిన కళాశాల భవనం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని లేని ఇతరులకు పనులు అప్పగిస్తామని సూచించారు. అనంతరం కళాశాలలో వంట గదిని పరిశీలించి నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందజేయాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం

తాండూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బా లికల విద్యాలయాన్ని ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఆహారం నాణ్యత, తాగునీరు, వంటశాల, భోజనశాల, వసతి గృహంలోని వసతులు, మూత్రశాలలు, గదులను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థినీ లతో మాట్లాడారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పాటశాల భవనంపై నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

- లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్

లక్షెట్టిపేట, జులై 18(ఆంధ్రజ్యోతి): యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని శ్రద్ధగా చదువుకోవాలని లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ యువకులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని సీఎస్ఐ మైదానంలో గంజాయి, సైబర్ క్రైంపై యు వకులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో యువత ఎక్కువగా గంజాయి బారిన పడి జీవితాన్ని నాషనం చేసుకోవడం జరుగుతుందన్నారు. గంజాయి నిర్మూళనే లక్ష్యంగా పోలీసుశాఖ పని చేస్తుందని యువతను కాపాడాలని ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒక్కసారి గంజాయికి అలవాటు పడితే జీవితం ఇక శూన్యం అని ముందుకు పోలేమన్నారు. అంతే కాకుండా ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంచుకోవాలని ఎవరికి ఓటీపీలు చెప్పకూడదని ఆన్‌లైన్‌గేమ్స్ ఆడకూడదని ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా లోన్‌ను ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదని వివరించారు. ఈకార్యక్రమంలో ఎస్సై వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేష్

భోజనంలో మెనూ తప్పక పాటించాలి

వాంకిడి, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని ఎంఈవో శివచరణ్ అన్నారు. మండలంలోని సోనాపూర్, మహగాం, గోయ గాం ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీ లించారు. విద్యార్థుల ప్రత్యేక హాజరు తప్పకుండా తీసుకోవాలని, మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలన్నారు. తెలంగాణ స్కూల్ ఎడ్యూకేషన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట సీఆర్పీ సందీప్ ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ

కెరమెరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): అనార్‌పల్లి, బాబేఝరి ఆశ్రమ పాఠశాలలను శుక్రవారం ఏసీఎంవో ఉద్దవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతన మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. చిన్నపాట్నాపూర్, పెద్దపాట్నాపూర్ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు.

సభ్యత్వ నమోదు

కౌటాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కౌటాల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. పీఆర్టీయూ తోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో యూఎన్ చారి, రమేష్, ఎంఎల్ రాజు, గణపతి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఆపద వేళ.. తపాలా బీమా

● తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం



తపాలా కార్యాలయం



వాంకిడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తపాలాశాఖలో తక్కువ ప్రీమియంతో ప్రమాద బీమా పాలసీలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగిన సమయంలో ఈ పాలసీలు దోహదపడుతాయి. అన్నివర్గాల ప్రజలకు అనుకూలంగా ఉండేలా తపాలాశాఖ ఆరోగ్య బీమా పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అనుకోని ఘటన జరిగినప్పుడు ఆసుపత్రుల్లో డబ్బులు ఖర్చుచేసి ఆర్థికంగా నష్టపోతాం, కొన్నిసార్లు పాక్షికంగా, తాత్కాలిక వైకల్యం ఏర్పడొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యక్తిగతబీమా అండగా ఉంటుంది. ఇదే క్రమంలో తపాలాశాఖ టాటాఏఐజీతో కలిసి సామూహిక ప్రమాద బీమా (గ్రూపు యాక్సిడెంట్ గార్డ్) పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకంలో వార్షిక ప్రీమియం రూ.399 చెల్లిస్తేచాలు రూ.10లక్షల బీమా వర్తిస్తున్నది. ఇండియన్‌పోస్టల్ పేమెంటు బ్యాంకు (ఐపీపీబీ) ద్వారా ప్రీమియాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

ప్రమాద బీమా ప్రీమియం వార్షిక చెల్లింపు ఇలా..

సంస్థపేరు	రూ.10లక్షలకు	రూ.15 లక్షలకు
టాటాఏఐజీ	రూ. 699	
ఆదిత్య బిర్లా క్యాపిటల్	రూ. 549	749
రిలయన్స్ జీఐ	రూ. 550	
నివా హెచ్ఐ	రూ. 555	755
బజాజ్ అలియాంజ్	రూ. 557	--
స్టార్ హెచ్ఐ	రూ.559	799
ఎస్ఎఫ్	రూ. 565	

పాలసీని బట్టి..

పాలసీ, వయస్సును బట్టి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 18-65ఏళ్లమధ్య వయస్సు ఉన్నవారంతా అర్హులు. ప్రమాదంలో మరణించినా, శాశ్వతవైకల్యం ఏర్పడినా, అవయం కోల్పోయినా, పక్షవాతం వచ్చినా రూ.10 లక్షలు చెల్లిస్తారు. ప్రమాదం జరిగి బీమా తీసుకున్న వ్యక్తి వైద్యంకోసం ఆసుపత్రిలో చేరితేఐపీడీ(ఇన్‌పెషెంట్ డిపార్ట్‌మెంట్) కింద రూ.లక్ష క్లయిం చేస్తారు. ఆసుపత్రిలో రోజువారీ నగదుగా 10రోజులవరకు నిత్యం రూ.వెయ్యి చెల్లిస్తారు. విద్య ప్రయోజనానికి గరిష్ఠగా ఇద్దరు పిల్లలకు రుసుములో 10శాతం లేదా రూ.లక్షవరకు ఎంచుకో వచ్చు. కుటుంబ ప్రయోజనాలకు రూ.25వేలు, అంత్యక్రియలకు రూ.5వేలు చెల్లిస్తారు.

తక్కువ మొత్తంతో..



తక్కువ మొత్తం చెల్లించి ఎక్కువ పరిహారం పొందేలా ప్రీమియంలు ఉన్నాయి. ఆరోగ్యరీత్యా ప్రతి ఒక్కరికీ బీమా అవసరం. భవిష్యత్తులో ఆరోగ్య విష యంపై ప్రతి ఒక్కరూ తపాలా శాఖలో బీమా చేసు కోవాలి. అను కోని ఘటన జరిగినప్పుడు తపాలా బీమా ఉపయోగ పడుతుంది. ప్రజలు సద్వి ని యోగం చేసుకోవాలి.

- అవినాష్, తపాలాశాఖ అధికారి, వాంకిడి

గోడ కూలి..ఇద్దరి దుర్మరణం

బ్రాహ్మణపల్లిలో పనులు చేస్తుండగా ప్రమాదం..

కోటపల్లిలో విషాదం


మృతిచెందిన కూలీలు

కోటపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కూలి పనికి వెళ్తేనే ఆ కుటుంబం గడిచేది. పొద్దంతా చెమటోడ్చి పని చేయడం..వచ్చిన కొద్ది పాటి డబ్బుతో కుటుంబాన్ని సాకడం..ఇదీ వారి దిన చర్య.. రోజులాగే శుక్రవారం కూడా వారు కూలికి వెళ్లారు. కానీ తిరిగి రాలేదు. పనికి వెళ్లిన వారు తిరిగి వస్తారని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న వారి కుటుంబ సభ్యులకు మాత్రం చేదు వార్తే అందింది. పనులకు వెళ్లిన ఆ ఇద్దరూ ఇక తిరిగిరారని.. పూర్తి వివరాల ప్రకారం.. కోటపల్లి మండల కేంద్రానికి శేగం తిరుపతి (50), రెడ్డి మధునయ్య (52) అనే వ్యక్తులు పక్క గ్రామానికి కూలి పనులకు వెళ్లి గోడ కూలడంతో కానరాని లోకాలకు వెళ్లారు. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రాహ్మణపల్లి గ్రామంలో వెల్మ శ్రీనివాస్ అనే వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. దీంతో అతను నూతన ఇంటిని నిర్మించుకోవాలనుకున్నాడు. ఇందులో భాగంగా అతడు నివాసం ఉంటున్న పాత ఇంటిని కూల్చివేసేందుకు కూలి పనుల నిమిత్తం కోటపల్లికి చెందిన శేగం తిరుపతి, రెడ్డి మధునయ్యలతో పాటు మరో నలుగురిని పనులకు పిలిచాడు. కాగా నలుగురు ఒక వైపు ఇద్దరు మరో వైపు ఉండి పాత గోడలు కూల్చుతున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా గోడ ఆ ఇద్దరిపై పడింది. అయితే ఇంటిపై గోడ భాగం నుంచి తొలగించాల్సి ఉండగా కింద నుంచి తవ్వడం వల్లనే ఒక్కసారిగా గోడ కూలి పనులు నిర్వహిస్తున్న తిరుపతి, మధునయ్యపై పడినట్లు తెలుస్తోంది. దీంతో ఆ పక్కనే పనులు చేస్తున్న కూలీలతో పాటు ఇంటి యజమాని, చుట్టు పక్కల వారు ఒక్కసారిగా ఇద్దరిపై పడిన గోడ శిథిలాలను తొలగించారు. అప్పటికే ఆ ఇద్దరు తీవ్ర గాయాలపాలై ఉన్నారు. వెంటనే 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను చెన్నూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో రెడ్డి మధునయ్య మృతిచెందాడు. ఆసుపత్రిలో చికిత్స నిర్వహిస్తుండగా శేగం తిరుపతి మృత్యువాడ పడ్డాడు. ఘటన స్థలాన్ని రూరల్ సీఐ బన్సీలాల్, తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి సందర్శించారు. మృతి చెందిన తిరుపతికి భార్య భీమక్కతో పాటు ముగ్గురు కూతుళ్లు ఉండగా రెడ్డి మధునయ్యకు భార్య గతంలోనే మృతిచెందగా కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ పేర్కొన్నారు.

కుటుంబాల్లో విషాదం

నిత్యం కూలి పనులకు వెళ్తూ కుటుంబాలను సాకుతున్న కూలీలు ఇద్దరు మృ తిచెందడంతో ఆ కుటుంబాల్లో విషాదం అలుముకుంది. మృత్యువాత పడ్డ ఇద్దరూ కోటపల్లికి చెందిన వారే కావడంతో కోటపల్లిలో విషాద చాయలు అలుముకున్నాయి. ఎంతో కొంత సంపాదించి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే ఇరువురు కానరాని లోకాలకు వెళ్లారన్న సమాచారంతో వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

లంచం ఇస్తేనే..బీమా సొమ్ము

● ఏసీబీకి పట్టుబడ్డ కార్మిక శాఖ అధికారులు

● మంచిర్యాలలో ఒకరు.. బెల్లంపల్లిలో మరొకరు



పట్టుబడిన అసిస్టెంట్ లెబర్ ఆఫీసర్ రాంమోహన్, పట్టుబడ్డ సహాయ కార్మిక అధికారి, అసిస్టెంట్

నస్పూర్/మంచిర్యాలక్రైం/బెల్లింపల్లి జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొందరు ప్రభుత్వ ఉద్యోగులు లంచం కోసం ఎంతకైనా సిద్ధమవుతున్నారు. ఏ మాత్రం మానవత్వం కూడా లేకుండా చివరికి మృతి చెందిన వారి కుటుంబానికి రావాల్సిన బీమా సొమ్ము చెల్లించేందుకు కూడా లంచం డిమాండ్ చేస్తున్నారు. కానీ చివరికి ఏసీబీకి పట్టుబడుతున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లిలో కార్మిక శాఖ అధికారులపై ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. బాధితుల నుంచి లంచం తీసుకుంటుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల అసిస్టెంట్ లెబర్ ఆఫీసర్ (కాగజ్‌న గర్ ఇన్‌చార్జి) కాటం రాంమోహన్ రూ. 50వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ మధు తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాదుదారుడి సోదరుడు భవన నిర్మాణ రంగంలో కార్మికుడిగా పని చేస్తూ కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. లెబర్ ఇన్సూరెన్స్ ద్వారా ప్రమాద బీమా మొత్తం రూ. 6.30 లక్షలు మృతుడి కుటుంబానికి రావాల్సి ఉంది. ఆ డబ్బుల కోసం మంచిర్యాల అసిస్టెంట్ లెబర్ ఆఫీసర్ రాంమోహన్‌ను బాధితులు సంప్రదిస్తే ఆయన రూ. లక్షా 50 వేలు లంచం డిమాండ్ చేసాడు. తమ వద్ద అన్ని డబ్బులు లేదని చెప్పడంతో చివరకు 50వేలకు ఒప్పందం చేసుకున్నారు. అనంతరం బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అధికారుల సూచనల మేరకు శుక్ర వారం మంచిర్యాలలో అధికారి రాంమోహన్ ఇంట్లో రూ. 50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రాంమోహన్‌ను కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు.

● బెల్లంపల్లి సహాయ కార్మిక అధికారి కార్యాలయంపై శుక్రవారం ఏసీబీ అధికారులు దాడి చేశారు. లంచం తీసుకుంటుండగా సహాయ కార్మిక అధికారితో పాటు అసిస్టెంట్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి పట్టణానికి చెందిన నరాల శంకర్ బిల్డింగ్ లేబర్ వర్కర్‌గా పని చేసేవాడు. గత సంవత్సరం ఏప్రిల్‌లో అనారోగ్యంతో ఆయన మృతి చెందాడు. మృతుడికి లేబర్‌కార్డు ఉండడంతో ప్రభుత్వం నుంచి రూ.లక్షా30వేల బీమా డబ్బులు రావాల్సి ఉంది. ఆడబ్బుల కోసం మృతుడి భార్య లేబర్ కార్యాలయంలో విధులు నిర్వహించే సహాయ కార్మిక అధికారి సుకన్యను సంప్రదించింది. దీనికి ఆమె రూ.40వేల డబ్బులు డిమాండ్ చేసింది. దీంతో బాధితురాలు ఈ నెల 8న మంచిర్యాల ఏసీబీ కార్యాలయానికి వచ్చి ఈ విషయంపై ఫిర్యాదు చేసింది. ఏసీబీ అధికారుల సూచనల మేరకు శుక్రవారం బాధితురాలు లేబర్ కార్యాలయానికి వెళ్లి 30వేల నగదు తీసుకొచ్చానని సుకన్యకు తెలిపింది. దీంతో ఆమె అసిస్టెంట్ రాజేశ్వరిని పిలిచి డబ్బులు తీసుకోవాలని సూచించింది. బాధితురాలు అసిస్టెంట్ రాజేశ్వరికి లంచం డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఇద్దరినీ కస్టడీలోకి తీసుకొని శనివారం కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు.

భూ వివాదంలో మహిళ ఆత్మహత్యాయత్నం


ఎండీ సీమా

జన్నారం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల మధ్య ఏర్పడ్డ భూ వివాదంలో జన్నారం గ్రామానికి చెందిన మహ్మద్ సీమా అనే మహిళ శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు మహ్మద్ సీమా భర్త మహ్మద్ ఫైమోద్దీన్ వికలాంగుడు. ఇద్దరు అన్నదమ్ముల వాటాకు రావాల్సిన భూమి గతంలోనే పంచుకున్నారు. ఉన్న భూమిలో సాగు చేసుకుంటుండగా గత సంవత్సరం నుంచి తన బావ జైపూర్ అట వీసెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ ముదీపద్దీన్ అడ్డుతగులుతూ చిత్ర హింసలకుగురి చేస్తూ గతంలో సైతం దాడులకు పాల్పడ్డాడు. కొద్ది రోజుల క్రితం భూమిలో గడ్డి మందు కొట్టడంతో పంట మొత్తం పాడైంది. దీంతో మనస్తాపానికి గురై భూమి వద్దే హెయిర్ డై తాగింది. బాధితురాలిని కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఏసీపీ తండ్రి మృతి


ఐలయ్య(ఫైల్)

మంచిర్యాలక్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల రాళ్లవాగు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి ఏసీపీ తండ్రి సింగరేణి గని రిటైర్డ్ కార్మికుడు గజ్జి ఐలయ్యయాదవ్(85) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం రసూల్‌పల్లికి చెందిన ఐలయ్య యాదవ్ ద్విచక్రవాహనంతో హాజీపూర్ నుంచి మంచిర్యాలకు వస్తుండగా ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో కిందపడడంతో ట్రాక్టర్ తలపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి సీఐ ప్రమోద్‌రావు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఐలయ్య కుమారుడు క్రిష్ణతో పాటు మంచిర్యాల డీసీపీ బాస్కర్, ఏసీపీ ప్రకాశ్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తండ్రి మృతదేహం వద్ద ఏసీపీ క్రిష్ణ కన్నీరు మున్నీరుగా రోదించారు. ట్రాక్టర్ డ్రైవర్ అందుగుల అనిల్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తిరుపతి తెలిపారు.

ఆర్‌వోఎఫ్ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టిన వ్యక్తి రిమాండ్

చింతలమానేపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): కర్జవెల్లి రేంజ్ పరిధిలోని దిందా గ్రామానికి చెందిన సురేష్ బండేపల్లి బీట్ పరిధిలో గల రిజర్వు ఫారెస్టులో అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టారని ఆగస్టు 1 వరకు సిర్పూర్(టి) జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో ఆసిఫాబాద్ జిల్లా జైలుకు తరలించినట్లు కర్జెల్లి ఎఫ్ఆర్వో ఎక్బాల్ తెలిపారు. అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని ఎఫ్‌బీవో కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశారని అన్నారు. నిబంధనల ఉల్లంఘించారని దీంతో ఈ నెల 17న అరెస్టు చేసి, శుక్రవారం కోర్టులో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట ప్రవేశ పెట్టగా ఆగస్టు 1 వరకు రిమాండ్‌కు విధించారని అన్నారు. నిందితుడిపై గతంలో చింతలమానేపల్లి పోలీసు స్టేషన్‌లో మూడు కేసులు ఉన్నాయని అన్నారు. టేకు కలప అక్రమ రవాణా కేసు మరోటి ఉందని చెప్పారు. బండేపల్లి బీట్‌లోని రిజర్వ్ ఫారెస్టు ప్రభుత్వ ఆస్తి, పర్యావరణ జీవ ఆవాసాలకు దెబ్బతీస్తూ ఉద్దేశపూర్వకంగా నిర్మిస్తూ వన్యప్రాణుల ఆవాసాలను నాశనం చేస్తున్నారన్నారు. ఇదే కాకుండా 24 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించుకొని ప్రజలను రెచ్చగొట్టాడని అన్నారు. దీని ఫలితంగా దాదాపు రెండు వేల ఎకరాలు ఆక్రమణకు గురైందని తెలిపారు. ఈ నెల 15న నేరం చేయాలనే ఉద్దేశంతో అటవీ అధికారులు మొక్కలు నాటుతున్న క్రమంలో గ్రామస్థులు సురేష్ ప్రోద్బలంతో అటవీ శాఖ అధికారులకు వ్యతిరేకంగా గుమిగూడారని తెలిపారు.

వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీల్లో వివిధ శాఖల ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యదర్శి లక్ష్మీనారాయణతో కలిసి మిషన్ భగరథ, వ్యవసాయ, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్య, విద్యుత్, హౌసింగ్ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు 2023-24 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల వివరాలను ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ పోర్టల్‌లో నమోదు చేసే అంశంపై అందించిన శిక్ష కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీల్లో తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్న కుటుంబాల సంఖ్య, గ్రామ పంచాయతీ పరిధిలో కబ్జా నివాస గృహాల వివరాలు నమోదు చేయాలని చెప్పారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల ప్రజలపై జరిగిన ఘటనల వివరాలు ఉంటే ప్రస్తుత స్థితిగతులు పొందుపరుచాలని చెప్పారు. గ్రామ పంచాయతీలలో ఆరోగ్య భీమా కలిగిన కుటుంబాల సంఖ్య అందుబాటులో ఉన్న నర్సరీలు, సామాజిక పెన్షన్‌లు, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగ పెన్షన్ల సంఖ్య, మిషన్ భగరథ ద్వారా తాగునీరు అందుతున్న కుటుంబాల వివరాలు, విద్యుత్ సౌకర్యం కలిగిన ఇళ్ల సంఖ్య ఇతర పూర్తి వివరాలను ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఉమర్‌హుస్సేన్, ఎంపీడీవోలు, కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఏడు సీట్లు

రెబ్బెన, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రామగుండంలోని సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)లో సింగరేణి అధికారులు, ఉద్యోగుల పిల్లలకు ఏడు ఎంబీబీఎస్ సీట్లు కేటాయించినట్టు జీఎం ఎం విజయ భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ అర్హత సాధించిన ర్యాంకు ఆధారంగా విద్యార్థులకు సీటు కేటాయించారని పేర్కొన్నారు. నీట్ ర్యాంకు కార్డు, అర్హత పత్రాలను ఉద్యోగులు పని చేసే గనుల అధికారులతో ధ్రువీకరణ చేయించాలని సూచించారు. ధ్రువీకరించిన పత్రాలను ఈ నెల 25 లోపు మెయిల్‌కు పంపించాలని తెలిపారు. వివరాలకు జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంటులో ఉద్యోగులు, గనుల డిపార్టుమెంటులో సంప్రదించాలని కోరారు.

పాఠశాలను తనిఖీ చేసి.. పాఠాలు బోధించి..


పవర్‌గూడలో పాఠాలు చెబుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

జైనూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండంలోని పవర్‌గూడలోని ప్రాథమిక పాఠశాలను శుక్ర వారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీ తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, శస్త్రచికిత్సల గది, మందుల నిల్వలను పరిశీలించారు. చికిత్స పొం దుతున్న రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. పరిసరాల శుభ్రత గ్రామాల్లో పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని భుషిమెట్ట గ్రామాన్ని సందర్శించి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డిని ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, ఆసుపత్రి డీసీహెచ్ఎస్ చెన్న కేశవ్‌రావ్, సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, వైద్యాధికారులు అరవింద్, మురళి, ఉదయ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోహన్, ఎంఈవో మధుకర్, నాయకుడు అంబాజీ, తదితరులు ఉన్నారు.



అవగాహన లేకుండా ఆరోపణలు సరికాదు

కాసిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొన్ని సంఘాలు అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని ఏఐటీయూసీ డిప్యూటి జనరల్ సెక్రటరీ ముస్కే సమ్మయ్య అన్నారు. కాసిపేట 2వ గనిపై శుక్రవారం ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌లో సమ్మయ్య మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధన కోసం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంఘటితంగా పోరాటాలు చేస్తున్నామని చెప్పారు. సింగరేణి యాజమాన్యం నుంచి హక్కులను చట్టబద్దంగా సాధించేందుకే స్ట్రక్చర్ సమావేశాలకు హాజరవుతున్నామన్నారు. అనంతరం స్థానిక ంగా ఉన్న సమస్యలపై గని మేనేజర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరడంతో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. సమా వేశంలో కాసిపేట 2వగని ఫిట్ సెక్రటరీగొల్ల శ్రీనివాస్, ఏఐటీయుసీ బెల్లంపల్లి బ్రాంచి ఇంచార్జీ చిప్ప నర్సయ్య, కార్యదర్శి దాగాం మల్లేశ్, దాసరి తిరుపతిగౌడ్, నర్సయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు బొగ్గు ఉత్పత్తి సాధించాలి


బొగ్గు ఉత్పత్తి పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

మందమర్రిటౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అంతరాయం కలుగకుండా అదనపు బొగ్గు ఉత్పత్తి సాధించాలని సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు వెంకటేశ్వర్లు అన్నారు. ఏరియాలోని కేకే ఓసీని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలంలో ఓపెన్‌కాస్టులో నీరు చేరితే వెంటనే వాటిని తొలగించేందుకు పంపులు, మోటార్లు అమర్చుకోవాలని చెప్పారు. ప్రమాద రహిత ఉత్పత్తే యాజమాన్యం ప్రధాన లక్ష్యమనే విషయా న్ని గ్రహించాలన్నారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలని తెలిపారు. మందమర్రి ఏరియాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమిస్తూ అదనపు ఉత్పత్తి సాధించడం ద్వారానే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే సైడ్ కేకేఓసీ ఆర్‌అండ్‌ఆర్ ప్రాజెక్టును సందర్శించారు. రైల్వేసైడ్ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీఎం దేవేందర్‌తో పాటు ఎస్ఓటు జీఎం విజయ్ ప్రసాద్, కేకేఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, గని మేనేజర్ రామరాజు, సీనియర్ ఇంజనీర్ బాలాజీ, సివిల్ ఎస్ఈ రాము,

మొక్కలు నాటాలి

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పదికిపైగా మొక్కలు నాటాలని సింగరేణి డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఏరియాలోని కేకే ఓసీ వద్ద మొక్కలు నాటారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం దేవేందర్, ఎస్ఓటు జీఎం విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలని డీఈవో యాదయ్య అన్నారు. ఆసిఫాబాద్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణకు ఆ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్న భౌతికశాస్త్ర, గణితశాస్త్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయుల కోసం ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేర్పల్లి పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించి మెనూ పాటించాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

నిధులు దుర్వినియోగంపై విచారణ జరపాలి



డీసీపీకి ఫిర్యాదు చేస్తున్న క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

బెల్లంపల్లి, జూలై18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రికెట్ అభివృద్ధి కోసం వచ్చిన నిధులను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు దుర్వినియోగం చేశారని విచారణ జరిపించాలని కోరుతూ శుక్రవారం డీసీపీ భాస్కర్‌కు తెలంగాణ క్రికెట్ జిల్లా అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి క్రీడాకారులకు క్రీడా సామగ్రి కోసం, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి నిధులు మంజూరయ్యాయని ఈ నిధులను దుర్వినియోగం చేసిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులపై చర్యలు తీసు కోవాలన్నారు. నిధుల దుర్వినియోగంపై డీసీపీకి ఫిర్యాదు చేశామని వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్, జిల్లా కోఆర్డినేటర్ అల్లం వెంకటేశ్వర్లు, కోచ్‌లు జాడి శేఖర్, గౌతమ్, సభ్యులు హరీశ్, రాజేశ్ పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న టీఎస్‌యుటీఎఫ్ జిల్లా నాయకులు

బెల్లంపల్లి, జూలై18 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చక్రపాణి, రాజవేణులు అన్నారు. శుక్రవారం టీఎస్‌యుటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో పని చేసే రెగ్యులర్ ఉపాధ్యాయులకు పారిటి స్కేల్ వర్తింప చేయాలని గురుకుల ఉపాధ్యాయులను బోధనేతర పనులనుంచి మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. పదోన్నతులు, బదిలీలను చేపట్టాలని దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కేజీబీవీ సిబ్బందికి, ఆశ్రమ పాఠశాలల సీఆర్‌టీలకు సమాన పనికి సమానవేతనం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బబిత, మండల అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శులు తిరుపతిలు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ పర్యటన



ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

హాజీపూర్, జూలై18 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు తీసుకున్న చంద్రయ్య శుక్రవారం హాజీపూర్ మండలంలో పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయం, ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించారు. తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, రెవెన్యూ సిబ్బంది పూలమొక్క ఇచ్చి అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూ భారతిలో వస్తున్న దరఖాస్తులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన రైతులతో మాట్లాడారు. అనంతరం ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టును సందర్శించి సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రాజెక్టు వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ అతీశ్, సీనియర్ అసిస్టెంట్ రంజిత్ పాల్గొన్నారు.

మందమర్రిలో దొంగతనం

ఆరు తులాల బంగారు ఆభరణాల అపహరణ

మందమర్రిటౌన్, జూలై18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బురద గూడెంకు చెందిన సింగరేణి ఉద్యోగి దుర్గం రాజ్‌కుమార్ నివాసంలో దొంగలు పడ్డారు. ఆరు తులాల బంగారు ఆభరణాలు అపహరించుకు పోయారు. రాజుకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 16న ఊరికి వెళ్లాడు. ఈ నెల 18న ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు పగులకొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. బీరువా తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. ఎవరైన పని నిమిత్తం ఊర్లకు వెళితే తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. దొంగతనానికి పాత నేరస్తులను కూడ ఆరా తీస్తామని తెలిపారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

మద్యం ఎరుగని గిరిజన గ్రామాలు..

- 12 ఏళ్లుగా అమ్మకాలు, కొనుగోళ్లు నిషేధం
- అమ్మితే రూ.50వేల జరిమానా
- ఆదర్శంగా నిలుస్తున్న వెంకటాపూర్ గ్రామ పంచాయతీ

కాసిపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మద్యం అమ్మకాలకు రెక్కలు వచ్చాయి. ప్రతి గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు విపరీతంగా పెరిగిపోయాయి. మంచినీళ్ల దొరకని గ్రామాలు ఉండవచ్చుకాని మద్యం దొరకని గ్రామాలు ఉండవంటే అతిశయోక్తి కాదు. కాసిపేట మండలంలో వెంకటాపూర్ గ్రామ పంచాయతీలో అందుకు బిన్నంగా 2013 నుంచి మద్యం అమ్మకాల కొనుగోళ్లను గిరిజన గ్రామాలు నిషేధించాయి. నేటికి కూడ ఐదు గిరిజన గ్రామాల్లో మద్యం అమ్మకాలు, కొనుగోళ్ల జరుగడం లేదు. ఒకవేళ మద్యం అమ్మినట్లయితే రూ.50వేలు చెల్లించే విధంగా తీర్మానం చేసుకున్నారు.

గిరిజన దేవతుల పూజలు, పండుగలు, గిరిజన పెండ్లి వేడుకల్లో మద్యం అంతర్భాగంగానే కొనసాగుతుంది. వెంకటాపూర్‌లో మాత్రం అందుకు భిన్నంగా 12ఏళ్ల నుంచి మద్యం లేకుండానే వేడుకలు జరుపుకోవడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

మద్యం అమ్మితే జరిమాన...

పంచాయతీల పునర్విభజనలో సోనాపూర్ ఉమ్మడి పంచాయతీ నుంచి 2019లో వెంకటాపూర్ గ్రామ పంచాయతీగా పురుడు పోసుకుంది. 310 కుటుంబాలు, 669 మంది జనాభతో ఏర్పడిన కొత్త పంచాయతీలో మద్యం నిషేధాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు కఠిన నిబంధనలు రూపొందించారు. గ్రామాల్లో ఎక్కడైన గుడుంబ, మద్యం అమ్మకాలు నిర్వహిస్తే రూ. 50వేల జరిమాన విధించే తీర్మానం చేసుకున్నారు. దీంతో భయభక్తులు కలిగిన జనం మద్యం అమ్మకాలు చేపట్టడం లేదు. ప్రజలందరూ సమిష్టిగా ఉండి మద్యపానం నిషేదాన్ని కొనసాగిస్తున్న గిరిజన గ్రామాల ను ఆదర్శంగా తీసుకోవాలని గ్రామ ప్రజలను పలువురు అభినందిస్తున్నారు.



మద్యపానం నిషేధిస్తూ తీర్మానం రాసుకుంటున్న గ్రామస్తులు

తీర్మాణానికి కట్టుబడి...

ఉమ్మడి సోనాపూర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పుడే గిరిజనగూడాల్లో మద్యం ఏరులైపారేది. మద్యం మత్తులో ప్రతిరోజు గొడవలు, పోలీసు కేసులు, ఆత్మహత్యలు ఎక్కువగా జరిగేవి. 2012లో ఒకే ఏడాది మద్యానికి బానిసైన యువకులు ఐదుగురు మృత్యు వాతపడ్డారు. అతిచిన్న వయస్సులోనే భర్తను కోల్పోయిన గిరిజనబాలికల జీవితాల్లో చీకటి అలుముకుంది. దీంతో చలించిన గ్రామ పెద్దలు(పటేల్స్) సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో మద్యం అమ్మ రాదని తీర్మానం రాసుకున్నారు.

నేడు ఆతీర్మానానికి కట్టుబడి అరి డేపల్లి, లక్ష్మీపూర్, కుర్రెగడ్, వెంకటాపూర్, లక్ష్మీపూర్ కొలాంగూడ గ్రామాలు మద్య పానాన్ని పూర్తిగా నిషేధించాయి. వివాహ వేడుకలు పండగలు వస్తే కొందరు యువకులు ఊరిపొలి మేర అవతల తాగి వస్తున్నారేకాని గ్రామాల్లో మద్యం తీసు కరావడం లేదు.

యువత మద్యంతో చెడిపోవడం బాధ అనిపించింది..



వెంకటపూర్‌లోని యువత మద్యం, గంజాయి మత్తు పదార్థాలకు బానిసై చనిపోవడం నాకు చాలా బాధ అనిపించింది. ఎలాగైన ఊరిలోకి మద్యం రాకుండా ఆపి వేయాలని నిర్ణయానికి వచ్చి ఊరి పెద్దమనుషలం అం దరం సమావేశం ఏర్పాటు చేసుకున్నాం. మనుషలను చంపే ఈ మద్యం మాకొద్దని తీర్మానం చేసుకో వడంతో ఊరందరు మాకు మద్దతు పలికారు. 12ఏళ్ల క్రితం చే సుకున్న తీర్మానానికి ఇప్పటికీ అందరూ కట్టుబడి ఉ న్నారు. ఇప్పుడు గ్రామంలో గొడవలు, కొట్లాలు పోలీసు కేసులు ఏమి లేవు. ఊరంతా ప్రశాంతంగా ఉంది. దీం తో యువకులు ఆధ్యాత్మిక బోధనలు చేస్తుంటాం. దీని వల్ల యువత చెడు మార్గాల వైపు వెళ్లడం లేదు.

- కొముురం మహాధు, గ్రామ పటేల్ వెంకటాపూర్

ఆదర్శ పంచాయతీగా ఎదగడంఆనందంగా ఉంది...



మా గ్రామ పంచాయతీ మద్యం, మత్తు పదార్థాలు అమ్మరాదనే తీర్మానానికి ప్రజలందరూ కట్టుబడి ఉండడం నాకు ఆనందంగా ఉంది. అలాగే గ్రామంలో ఇం కుడు గుంతలు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకునే విధంగా పంచాయతీ నుంచి తీర్మానం చేశారు. దీనికి కూడ ప్రజలందరూ అన్నింటిని నిర్మించుకున్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. ఎదిగిన కొడుకును కోల్పోయిన తల్లిదండ్రులకు తీరని దుఖాన్ని మిగిలిస్తున్నారు. కాబట్టి యు వత చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా ఉన్నత ల క్ష్యాలతో చదివి స్థిరపడాలి.

- అడె సౌందర్య, తాజా మాజీ సర్పంచ్ వెంకటాపూర్

సర్కారు బడుల్లో మెరుగైన విద్యాబోధన

దత్తుమూర్తి, ఎంఈవో, మందమర్రి



ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నాం. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. నాణ్యమైన విద్య, భోజనం అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మందమర్రి మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి ?

ఎంఈవో : మండలంలో ప్రాథమిక 25, ప్రాథమికోన్నత 11, ఉన్నత పాఠశాలలు 5 ఉన్నాయి. వీటిలో 3200 మంది విద్యార్థులు చదువుకుం టున్నారు.

ఆంధ్రజ్యోతి : ఉపాధ్యాయులు కొరత ఉందా?

ఎంఈవో : ఉపా ధ్యాయుల కొరత పెద్దగా ఏమి లేదు. పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రతి రోజు ఆయా పాఠశాలలను తనిఖీ చేస్తున్నాం. ఉపాధ్యాయులు ఏకాగ్రతతో విద్యాబోధన చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : ఉపాధ్యాయుల సమయ పాలన పాటిస్తున్నారా?

ఎంఈవో : ఉపాధ్యాయులందరు సమయ పాలన పాటిస్తున్నారు. ప్రార్థన కంటే ముందే హాజరై విద్యార్థులతో ప్రా ర్థనలు చేస్తున్నారు. సమయ పాలనపై పాఠశాలల్లో తనిఖీలు చేస్తున్నాం.

-మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి)

సీతాకోక చిలుకల గుర్తింపుపై అవగాహన

చెన్నూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని కిష్టంపేట బీఆర్ అంబేద్కర్ ఆర్బన్ పార్కులో శుక్రవారం జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ఆశిష్‌సింగ్, శాస్త్రవేత్త రంజాన్ విరాణి ఆధ్వర్యంలో సీతాకోక చిలుకల గుర్తింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిష్టంపేట అర్బన్ పార్కు ఏరియాల్లో ఇప్పటి వరకు 80 వరకు వివిధ జాతుల సీతాకోక చిలుకలను గుర్తించారు.. ఈ పార్కు ఆవరణలో అరుదైన సీతాకోక చిలుకను గుర్తించామని తెలిపారు.

పదవుల కోసం నిరీక్షణ..

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. అలాగే టీడీపీ హయాంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షునిగా 6 సంవత్సరాలపాటు బాధ్యతలు నిర్వహించగా, టీఆర్ఎస్ పొలిట్ బ్యూరో సభ్యునిగా, స్టేట్ సెక్రటరీగా పని చేశారు. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పీసీసీ మెంబర్‌గా ఉన్న చెన్నూర్ నియోజక వర్గంలోని రామకృష్ణాపూర్‌కు చెందిన సీనియర్ నేత పిన్నింటి రఘునాథ్‌రెడ్డి కూడా డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. ఆయన ఉమ్మడి ఆదిలాబాద్ యూత్ జిల్లా అధ్యక్షుడిగా ఏడు సంవత్సరాలు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఐదేళ్లు, పీసీసీ కార్యదర్శిగా ఏడేళ్లు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ కో ఆర్డినేటర్‌గా పని చేసిన అనుభవం రఘునాథ్‌రెడ్డికి ఉంది. అలాగే బె ల్లంపల్లి నియోజకవర్గం నుంచి మరో సీనియర్ నేత, మాజీ జడ్పీటీసీ కారుకూరి రాంచందర్ కూడా డీసీసీ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. అయితే డీసీసీ పదవి భర్తీ పీసీసీ చేతిలో ఉండగా, అది ఎవరిని వరిస్తోందన్న చర్చ సాగుతోంది.

భర్తీకానున్న నామినేటెడ్ పదవులు...

టీపీసీసీ తీసుకున్న నిర్ణయం మేరకు స్థానిక సంస్థల ఎన్నికల లోపే నామినేటెడ్ పదవులను భర్తీ చేయడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయనున్నట్లు జోరుగా జరుగుతోంది. స్థానిక ఎన్నికల లోపు అన్ని రకాల పదవులు భర్తీ చేస్తేనే గ్రామ స్థాయిలో పట్టు బిగిస్తుందనే ఆలోచనతో పీసీసీ వీలైనంత త్వరగా పోస్టుల నియామకం ప్రక్రియ పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

జిల్లా స్థాయిలో గ్రామ కమిటీ లు, మండల పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతోపాటు డీసీసీ పదవులను భర్తీ చేయనున్నారు. అలాగే మార్కెట్ కమిటీలు (నియామకం జరగని చోట), గ్రంథా లయ చైర్మన్, వివిధ కార్పొరేషన్ చైర్మన్ల పదవులు భర్తీ కానున్నాయి.

కీటక జనిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

జైపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కీటక జనిత వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. పోషకాహారాన్ని సకాలంలో తీసుకోవాలన్నారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు వస్తే ఏఎన్ఎంకు కానీ వైద్యాధికారికి కాని సమాచారం అందించి చికిత్స పొందాలన్నారు. వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధుల గురించి వివరించి తీసుకో వాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. దోమల ఉత్పత్తిని అరికట్టడానికి డ్రై డే పాటించడమే మార్గమన్నారు. పరిసరాల్లోని కూలర్లు, పూల కుం డీలు, పాత టైర్లు మొదలైన వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఈవిషయాలను తల్లిదండ్రులకు, బంధువులకు విద్యార్థులు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రామ్మూర్తి, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, డాక్టర్ కమలాకర్, సెక్టోరియల్ అధికారి విజయలక్ష్మీ, స్పెషల్ ఆఫీసర్ ఫణిబాల, ఏఎన్ఎంలు విజయలక్ష్మీ, శ్రీల త పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్

ఉద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం

వేమనపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేస్తుందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నీల్వాయి జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లుల కోసం ప్రతి నెల 700 కోట్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఇప్పటి వరకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం కేవలం 180 కోట్లు మాత్రమే చెల్లించిందని, మిగితా బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీపీఎఫ్, టీఎస్‌టీఎల్ఐ బిల్లులను విడుదల చేయాలని, పీఆర్‌సీలు, డీఏలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌రెడ్డి, తపస్ మండల నాయకులు సురేష్, శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రతీ ఒక్కరూ పక్షులను సంరక్షించాలి

వైల్డ్‌లైఫ్ వార్డెన్ డాక్టర్ రంజాన్‌విరానీ



వెంకట్రావుపేట చెరువులో పక్షులను వీక్షిస్తున్న అధికారులు

లక్షెట్టిపేట, జులై 18(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ పక్షులను సంరక్షించాలని మహారాష్ట్ర యావత్‌మాల్‌కు చెందిన వైల్డ్‌లైఫ్ వార్డెన్ డాక్టర్ రంజాన్ విరానీ అన్నారు. లక్షెట్టిపేట అటవీ రేంజ్ ఆధ్వర్యంలో మండలంలోని వెంకట్రావుపేట గ్రామ చెరువులో శుక్రవారం పక్షుల వీక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షుల వైవిధ్యం, వాటి ఆవాసాలను పెంపొందించడం కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తామని అందులో భాగంగా వెంకట్రావుపేట గ్రామంలో ఇటీవల వివిధ రకాల పక్షులను గుర్తించామన్నారు. ఈచెరువును కమ్యూనిటీ కంజర్వేషన్ వెట్‌ల్యాండ్‌గా నామినేట్ చేయాలని పరిగణిస్తామన్నారు. కాలానుగణ వైవిధ్యాలను ట్రాక్ చేయడం కోసం పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యాన్ని అంచనా వేయడం కోసం అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. అంతే కాకుండా అక్రమంగా చెరువుల్లో చేపలు పట్టి పక్షులకు హాని కల్పించకూడదని చెరువు వాటాదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో లక్షెట్టిపేట అటవీ క్షేత్ర అధికారి అత్తె సుభాష్, సెక్షెన్ ఆఫీసర్ అల్తాఫ్ హుస్సేన్, ఎఫ్‌బీవోలు రాజశేఖర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గిరిజన మహిళల బైండోవర్

దండేపల్లి/జన్నారం జూలై 18(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం రాజు గూడ, మొకాసిగూడ చెందిన ఐదుగురు గిరిజన మహిళలను శుక్రవారం దండేపల్లిలో స్థానిక తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేసినట్లు తాళ్లపేట ఎఫ్ఆర్‌వో సుష్మారావు తెలిపారు. లింగాపూర్ రిజ్వర్ ఫారెస్టు లో గిరిజన మహిళలు కొద్ది రోజుల నుంచి పోడు వ్యవసాయం కోసం అటవీ భూమిలో చెట్ల పొదలు తొలగించారు. దీంతో అధికారులు 26 మంది గిరిజన మహిళలపై కేసులు నమోదు చేయగా, ఇటీవల వీరిని బైండోవర్ చేసేందుకు యత్నించారు. వారు వినకపోవడంతో అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు. ఎఫ్ఆర్‌వో వెంట ఎఫ్ఎస్‌వో రాజేందర్, ఎఫ్‌బీవో నగేందర్ ఉన్నారు.

ఎంపీడీవో పర్యటన

వేమనపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరారం, జిల్లెడ గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో కుమారస్వామి పర్యటించారు. ఈ సందర్భంగా సూరారంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీవో మధుకర్, పంచాయతీ కార్యదర్శులు సంతోష్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

నీల్వాయి ఎస్ఐగా సురేష్

వేమనపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నీల్వాయి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గోదావరిఖని పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంత వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ శ్యామ్‌పటేల్ రామగుండానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా యువకులు చెడు వ్యసనాలకు బానిస కావొద్దని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

బెల్లంపల్లి, జూలై18 (ఆంధ్రజ్యోతి): అమృత్ 2.వో కింద చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం పట్టణంలో అమృత్ 2.వోలో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో మాట్లాడారు. పనులు పూర్తి చేసి పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరాను ప్రారంభించాలన్నారు. వర్షాకాల నేపథ్యంలో వ్యాధుల నివరణకు చర్యలు తీసుకోవాలన్నారు. పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కమిషనర్‌కు సూచించారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి అజ్మీరా పురుషోత్తం నాయక్

లక్షెట్టిపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా పట్టుదల క్రమశిక్షణతో చదువుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అజ్మీరా పురుషోత్తం నాయక్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలతో పాటు వసతిగృహాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్బంగా మాట్లాడుతూ ప్రభుత్వం పేద వెనుకబడిన విద్యార్థులకోసం ప్రత్యేకంగా ప్రణాళికను సిద్ధం చేసిందన్నారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పాండురంగారావు, సూర్యకుమారి పాల్గొన్నారు.

'విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు'

దండేపల్లి జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే గొప్పస్థాయికి చేరుకోవచ్చునని విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని క్రమశిక్షణతో చదువుకోవాలని ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్మెంట్ ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు లిప్సిక, విజయ కోరారు. దండేపల్లి మండలం రెబ్బనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో శుక్రవారం ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్మెంట్ ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుకుంటేనే భవిష్యత్తులో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. సెల్‌ఫోన్, టీవీలు చూడకుండా ఇష్టంతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రూపాచారి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ద్వారా చదవొచ్చు

జైపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ ద్వారా బడి మధ్యలో మానేసిన విద్యార్థులు చదువులు కొనసాగించవచ్చని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ బంధువులు, స్నేహితులకు ఓపెన్ స్కూల్ గురించి తెలియజేయాలన్నారు. ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్ రెండు కోర్సుల్లో చదువు మానేసిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పై చదువులు చదవడానికి, ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని, రెగ్యులర్ సర్టిఫికెట్లతో సమానమని పేర్కొన్నారు. అనంతరం ఓపెన్ స్కూల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కో ఆర్డినేటర్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ ఐడీ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

దండేపల్లి జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగి ఉన్న రైతులందరు ఫార్మర్ ఐడీ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఈవోలు మౌనిక, శ్రీకన్య, అర్చన, సౌజన్య, అకిల్, నరేష్‌లు శుక్రవారం ఓప్రకటనలో సూచించారు. రైతులందరూ ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే కేంద్ర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు తమ వెంట ఆధార్‌కార్డు, ఓటీపీ వచ్చే ఫోన్‌ను తీసుకురావాలన్నారు.

అంతర్జాతీయ లయన్స్‌క్లబ్ మహాసభకు మండల వాసి

జన్నారం,జూలై18(ఆంధ్రజ్యోతి): ఓర్లాండో, ఫ్లోరిడా యుఎస్‌లోని ఆరెంజ్ కౌంటీ కన్వెన్షన్‌లో జరిగిన లయన్స్ క్లబ్ అంతర్జాతీయ 107వ వార్షికోత్సవ మహాసభకు మండలానికి చెందిన ప్రముఖ స్లేట్ హైస్కూల్ కరస్పాండెంట్ లయన్స్ క్లబ్ సభ్యుడు శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌సీఐసీ 2025నందు లయన్ ఏపీసింగ్ లయన్స్‌క్లబ్ ఇంటర్‌నేషనల్ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారానికి హాజరవడం ఆనందంగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా జన్నారం మండలానికి ఎంతో ప్రజా సేవలు అందించామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 20వేలమంది ఈ లయన్స్ మహాసభకు హాజరయ్యారన్నారు. అందులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

ప్రకృతి వనంలోని మొక్కలను సంరక్షించాలి

జైపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పల్లె ప్రకృతి వనంలోని మొక్కలను సంరక్షించాలని ఎంపీవో శ్రీపతి బాపురావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెగడపల్లి గ్రామ పంచాయతీలో పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించి తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలని సూచించారు. గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. నర్సరీ మొక్కలు హోమ్ స్టెడ్ ప్లాంటేషన్ కింద గృహాలకు పంపిణీ చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పావని, సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు


శనివారం 19 జూలై 2025

- గిరిజనేతరులు మహారాష్ట్ర వైపు, గిరిజనులు తెలంగాణ వైపు
- భూముల పట్టా చుట్టే వ్యవహారం
- సరహద్దు గ్రామాల విలీన అంశంపై భిన్నాభిప్రాయాలు

కొందరు అటు.. మరి కొందరు ఇటు..


పరందోళి గ్రామం

ఆసిఫాబాద్/కెరమెరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో వివాదాస్పదంగా ఉన్న 12 గ్రామాల ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం లోని తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న 12 వివాదాస్పద గ్రామాలు తమ పరిధి లోకి వస్తాయని బుధవారం ముంబయిలో నిర్వహించిన సమావేశం లో ఆ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి చంద్రశేఖర్ బావన్కులే ప్రకటించడం చర్చనీయాంశం గా మారింది. ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు తెలంగాణ ప్రభుత్వం పట్టా ఇవ్వలేదని భూములను నమ్ముకొని వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్న గిరిజనేతరులు వాపోతున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల్లోగా తాము సాగు చేసు కుంటున్న భూములకు పట్టాలిస్తా మని హామీ ఇచ్చిందని, మహారాష్ట్ర రాష్ట్రంలోనే తాము కొనసాగుతామని చెబుతున్నారు. కాగా ఆయా గ్రామాలలోని గిరిజనులు మాత్రం తెలంగాణ రాష్ట్రంలోనే కొనసా గుతామని చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ భూములకు పట్టాలిచ్చి అన్ని సౌకర్యాలు కల్పిం చిందని తెలియజేస్తున్నారు. తమను తెలంగాణలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో కొంత మంది మహారాష్ట్ర వైపు మరి కొందరు తెలం గాణ వైపు మొగ్గు చూపుతున్నట్లుగా స్పష్టమవుతోంది.

వివాదాస్పద గ్రామాల్లో..

సరిహద్దుల్లోని వివాదాస్పద గ్రామాల అంశం భూముల పట్టాల చుట్టే తిరుగుతోంది. కెరమెరి మండలం లోని పరందోళి, అంతాపూర్, ఏసాపూర్, కోటా, పరస్‌వాడ, బొలాపటార్, పద్మావతి, ఇందిరనగర్, మహారాజ్‌గూడ, ముఖద్దంగూడ, లెండిజాల, గౌరి 12 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో సుమారుగా ఆరు వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఇందులో ఎస్సీ, బీసీ, మైనార్టీలు సుమారు నాలుగు వేల మంది ఉన్నారు. గిరిజనులు సుమారు రెండు వేల మంది ఉన్నారు. తెలంగాణ-మహారాష్ట్ర ప్రభుత్వాలు ఈ గ్రామాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. పంచాయతీ నుంచి మొదలు ఎంపీ ఎన్నికల వరకు ఆ గ్రామాల ప్రజలు రెండు రాష్ట్రాల ఓటింగ్‌లో పాల్గొంటున్నారు. తెలంగాణతో పోలిస్తే సంక్షేమ పథకాల అమలు విషయంలో మహారాష్ట్ర కొంత వెనుకబడి ఉందని చెబుతున్నారు. ఈ గ్రామాలలోని గిరిజనులు సాగు చేసు కుంటున్న భూములకు తెలంగాణ ప్రభుత్వం అటవీహక్కు పత్రాలు అందించింది. ఇదే క్రమంలో ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న గిరిజనే తర(ఎస్సీ, బీసీ, మైనార్టీలు)లకు ఎలాంటి హక్కు పత్రాలు ఇవ్వలేదు. దీంతో వీరు రుణాలు, రుణమాఫీ తదితర పథకాలను పొంద లేకపోతున్నారు. కానీ మహారాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం వివాదాస్పద గ్రామాల లోని అటవీ, రెవెన్యూ భూముల్లో సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేసింది. సాగులో ఉన్న గిరిజనేతురులు మహరాష్ట్రలోని రాజూరా ఎమ్మెల్యే దేవ్‌రావు బోంగ్దేదృష్టికి తీసు కువెళ్లారు. దీంతో అయన ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా బుధవారం ముంబయిలోని విదాన భవన్‌లో ఆ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి చంద్రశేఖర్ భవన్కులే అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజూర ఎమ్మెల్యే, చంద్రపూర్ కలెక్టర్, 12 గ్రామాలకు చెందిన కొందర ప్రజలు హాజరయ్యారు. ఈ గ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కరించేందుకు ఆ గ్రామాలు మహారాష్ట్ర పరిధిలోకే వస్తాయని కీల క ప్రకటన చేశారు. కానీ ఈ వివాదాస్పద గ్రామాల అంశం సుప్రీంకోర్టులో ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

మహారాష్ట్రలోనే ఉంటాం..

- కాంబ్లే లక్ష్మణ్, మాజీ సర్పంచ్, పరందోళి



మేము మహారాష్ట్రలోనే ఉంటాం. మాకు మహారాష్ట్ర ప్రభుత్వం పట్టాలిస్తామని హామీ ఇచ్చింది. గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూములకు తెలంగాణ ప్రభుత్వం పట్టాలు ఇవ్వలేదు. దీంతో మాకు పంట రుణాలు, రైతుభరోసా, రుణమాఫీ వర్తించడంలేదు. మహారాష్ట్ర ప్రభుత్వం గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిస్తామని హామీ ఇచ్చింది. అందువల్ల మహారాష్ట్రలోనే కొనసాగుతాం.

తెలంగాణలోనే కొనసాగుతాం..

- నితీన్ రాథోడ్, పరందోళి తండా



తెలంగాణ ప్రభుత్వం మేము సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇచ్చింది. దీంతో రైతుభరోసా, పంట రుణమాఫీ తదితర పథకాలు పొందుతున్నాం. తెలంగాణ రాష్ట్రంలోనే యువతకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మేము తెలంగాణలోనే కొనసాగుతాం. మా గ్రామాలను మహారాష్ట్రలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం.

విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు


గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిద్రిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రెబ్బెన, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. వసతి గృహంలో కలెక్టర్ నిద్ర కార్యక్రమంలో భాగంగా గురువారం గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి వసతి గృహంలో నిద్రించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, కల్పిస్తున్న సౌకర్యాలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు కలెక్టర్ నిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు నెలలో ఒక రోజు విద్యార్థులతో కలిసి నిద్రించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వార్డుల్లో డ్రై డే

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జన్కాపూర్, పైకాజీనగర్, బజార్‌వాడీ, సందీప్‌నగర్, కసబ్‌వాడితో పాటు ఇతర వార్డులలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. మున్సిపల్, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ కూలర్లలో ఉన్న నీటిని తొలగించారు. దోమల నివారణ మందులను స్ప్రే చేయించారు. నీరు నిలిచి ఉన్న ప్రదేశాలలో ఆయిల్‌బాల్స్ వేయించడంతో పాటు ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌కుమార్, టీఎంసీ అరుణ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు, వార్డు ఆఫీసర్ సందీప్, ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

రెబ్బెన, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌ను అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్‌బాడ్మింటన్ సంఘానికి అధ్యక్షుడిగా ఎంపిక చేసినందులకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్‌బాడ్మింటన్ చీఫ్ ప్యాట్రన్ అర్.నారాయణరెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి, కోశాధికారి యు.శంకర్, వైస్‌ప్రెసిడెంట్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వాడకంపై శిక్షణ

ఆసిఫాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జన్కాపూర్ రైతు వేదికలో ఏఈవోలకు నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయాధికా రులు అందరు రైతులకు నానో యూరియా, నానో డీఏపీలపై వాడకంప అవగాహన కల్పించి రైతులను వాడే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అగ్రనమిస్ట్ సుధాకర్‌రెడ్డి, జోనల్ మేనేజర్ మనోజ్‌కు మార్, కోరమండల్ సేల్స్ ఆఫీసర్ శ్రావణ్, వ్యవసాయాధికారి మిలింద్‌కుమార్, వెంకటి, మనోహర్ పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లకు శిక్షణా తరగతులు

ఆసిఫాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఎరువుల డీలర్లకు ఇక నుంచి ప్రతీ ఆదివారం శిక్షణా తరగతులు నిర్వహిస్తామని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని జన్కాపూర్‌లో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్పుట్ డీలర్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ఎరువుల డీలర్ల ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మినీకుమార్ ఫెసిలిటేటర్ సావన్ పాల్గొన్నారు. ఇప్పటి నుంచి ప్రతీ ఆదివారం డీలర్లకు శిక్షణ తరగతులు ఉంటామని తెలిపారు.

విద్యార్థులు చదువులో పోటీ పడాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్

కౌటాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పోటీ పడి చదవాలని, ప్రస్తుతం కృత్రిమ మేధస్సు అభివృద్ధి చెందుతున్న క్రమంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లతో సమయం వృధా చేసుకోవద్దని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కౌటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. కాలేజీలో అనేక సమస్యలు ఉన్నాయని గ్రామీణ ప్రాంతాల వచ్చే విద్యార్థులకు వసతి సౌకర్యం, టాయిలెట్లు, ల్యాబ్స్, తాగునీటి సౌకర్యాలు లేవని, హాస్టల్ వసతి కల్పిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని అధ్యాపకులు కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు.

కర్జెల్లి- గూడెం రోడ్డుకు మరమ్మతులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

చింతలమానేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జెల్లి- గూడెం రోడ్డుకు కోటిన్నర రూపాయల అంచనాలతో మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు, బీజేపీ నాయకులతో కలిసి శుక్రవారం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ రోడ్డు మరమ్మతుల కోసం రూ.కోటి న్నర మంజూరు చేయించామని చెప్పారు. టెండర్ల ప్రక్రియ ముగిసిందని, త్వరలోనే పూర్తి స్థాయి మరమ్మతులు నిర్వహిస్తామని తెలిపారు. ఫారెస్టు అధికారులను ఒప్పించి బీటీ రోడ్డు వేయించడానికి కృషి చేస్తామన్నారు. కొత్తగా బీటీ రహదారులు కర్జెల్లి- గంగాపూర్, గిన్నెలేటి- రవీంద్రనగర్, కౌటాల- తుమ్మిడిహెట్టి మధ్య నిర్మించడానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. త్వరలో పనులు మొదలు పెడతామని తెలిపారు. అనంతరం గూడెం పాఠశాలను సందర్శించి సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి వరకు పాఠశాల అప్‌గ్రేడ్ చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే వెంట ఆర్అండ్‌బీ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ క్రాంతి, పీఆర్ ఏఈ జీవన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు రాజేందర్‌గౌడ్, విజయ్, రామన్న, మల్లయ్య, నానయ్య, రంగన్నఉన్నారు. కాగా చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ సుశీల భర్త తిరుపతి, ఎమ్మార్పీఎస్ నాయకుడు శంకర్‌తో పాటు 20మంది బీజేపీలో చేరగా ఎమ్మెల్యే కండువా వేసి ఆహ్వానించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిర్పూర్(టి), జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు బాధితులకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేసినట్లు బీజేపీ మండలా ధ్యక్షురాలు లావణ్య తెలిపారు. కార్య క్రమంలో నాయకులు మహేష్, శంకర్, ఎస్.మహేష్, నానయ్య, అశోక్, గురుదాస్, బాలాజీ, దివాకర్, మారుతి, భగవాన్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సందల్ వేడుకలు

కాగజ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హజరత్ సయ్యద్ బాబా తాజుద్దీన్ సందల్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు సందల్ వేడుకల్లో పాల్గొన్నారు.

తుడుం దెబ్బ మండల కార్యవర్గం

సిర్పూర్(యు), జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. తుడుం దెబ్బ మండల అధ్యక్షుడుగా కుమ్ర భీంరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పెందోర్ శంకర్,పెందోర్ మాధవ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఆత్రం నాగోరావు, ఉపాధ్యక్షులుగా ఆత్రం దౌవత్‌రావు, ఆత్రం దేవ్‌రావు, సిడం సుబాష్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా విశ్వనాథ్, శివాజీ, కోడప్పా రాము, కనక తిరుపతి, సలహాదారులుగా మడావి బోజ్జిరావు, ఆత్రం ఆనంద్‌రావు, పెందోర్ నాగోరావు, దుర్వ శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కుమ్ర భీంరావు మాట్లాడుతూ ఆదివాసీల సమస్యల పరిష్కరానికి పాటుపడుతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, తుడుం దెబ్బ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షడు పెందోర్ దత్తు పటేల్, మాజీ సర్పంచులు ఆర్క నాగోరావు, ఆత్రం రాజేశ్వర్‌రావు, పెందోర్ నాగోరావు, నాయకులు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కార్మికులు

ఆసిఫాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కార్మికులకు రావాల్సిన 16 నెలల పెండిగ్ వేతనాలు చెల్లించాలని కార్మికులు కోరారు. పట్టణంలోని చిల్డ్రన్స్ పార్కులో శుక్రవారం మున్సిపల్ యూనియన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మున్సిపాలిటీగా ఏర్పడి 17 నెలలు పూర్తి అవుతున్నా ఇప్పటి వరకు అధికారులు కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వెంటనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు పట్టించుకొని చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రాజేందర్, కార్మికులు రాజయ్య, సమ్మయ్య, బాలేష్, శంకర్, ఇస్తారి, లక్ష్మి, బాలయ్య, లక్ష్మి, పద్మ, శ్యామల, లక్ష్మి, మల్లేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి సిద్ధం కావాలి

యూటీఎఫ్‌టీఎస్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

దహెగాం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూపీఎస్‌సీ పోరాటానికి సిద్ధం కావాలని యూటీఎఫ్‌టీఎస్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. మండలంలో శుక్రవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తులసీరాం, శ్రీనివాస్, రోహిత్, వినేష్ తదితరులు పాల్గొన్నారు.

కోనప్ప వర్గీయుల సంబరాలు

కౌటాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలో 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పూర్తి కావడంతో శుక్రవారం మండలంలోని రైతులు, కోనప్ప వర్గీయులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి సబ్ స్టేషన్ ఎదుట కోనప్ప చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాంతయ్య, వెంకన్న, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దహెగాం, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ మేనేజర్ నవీన్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బ్యాంకు ఆవరణలో శుక్రవారం రుణాలు పంపిణీ చేశారు. రుణాలను వ్యవసాయ పంటలకు, వ్యాపారాలకు వినియోగించుకోవాలన్నారు. 12 సంఘాలకు గాను రూ.20 కోట్లు బ్యాంకు లికేంజీ రుణాలు పంపిణీ చేసి లాగిన్ డే జరుపుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, ఎఫ్ఏ సూరిబాబు, క్యాషియర్ విజయ్‌కుమార్, అకౌంటెంట్ వెంకట్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలి

ఆసిఫాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో నాసిరకమైన కోడి గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని డీవైఎఫ్ఐ నాయకులు శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దినకర్, టీకానంద్, పాల్గొన్నారు.

కాల భైరవ స్వామికి భక్తుల పూజలు

రెబ్బెన, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం శ్రీ మహంకాళి ఆలయంలో శుక్రవారం కాలభైరవ స్వామికి భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి దేవర వినోద్ కాల భైరవ స్వామికి పంచామృతాలతో అభిషేకాలను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు తిరుపతిగౌడ్, శ్రీకర్, సంతోష్, శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించకుంటే ఎన్నికలు బహిష్కరిస్తాం


రాస్తారోకో చేస్తున్న కీమానాయక్ తండావాసులు

లింగాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి రోడ్డు నిర్మించకుంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని కీమానాయక్ తండా గ్రామస్థులు హెచ్చరించారు. కీమానాయక్ తండా గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ దశాబ్ద కాలం నుంచి కీమానాయక్ తండా, లొద్దిగూడ, పుల్సింగ్ తండా గ్రామాల ప్రజలు లింగాపూర్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నా రన్నారు. గర్భిణులను ఆసుపత్రికి తీసుకు వెళ్లేందుకు అంబులెన్స్ రాని పరిస్థితి ఉందని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవీందర్, బాబులాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కెరమెరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మండలంలోని హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు కెరమెరి పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మం డల స్థాయి వాలీబా ల్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఆరోగ్యవంతమైన జీవనశైలి పాటించాలన్నా రు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గంజాయి మొక్కలు పెంచడం, సరఫరా చేయడం, నిలువ చేయడం, అ మ్మడం లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ చిత్తరంజన్ హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ సత్యానారాయణ, ఎస్సై మధుకర్, ఎంఈవో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): యువత పెడదారి పట్టకుండా లక్ష్యాలతో ముందుకు సాగాలని ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు. రెబ్బెన మండల స్థాయి వాలీబాల్ పోటీలు గోలేటి సింగరేణి క్రీడామైదానంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కాంతిలాల్ ఆదేశాల మేరకు ఈ పోటీలను ప్రారంభించామని చెప్పారు. యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్